నీటి నాణ్యతను పరిశీలిస్తున్న మేయర్

ఫిల్టర్‌బెడ్ మరమ్మతులు త్వరగా చేపట్టాలి

వరంగల్, జనవరి 3: ఫిల్టర్‌బెడ్ మరమ్మతులను వెంటనే చేపట్టాలని మేయర్ సుధారాణి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీ చేశారు. తాగునీటి శుద్ధీకరణ, నీటి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈ రంగనాథ్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

పర్వతగిరి, జనవరి 3: సోమారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గడ్డం వెంకటనారాయణగౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం ఆయన తాటి చెట్టు ఎక్కుతుండగా జారి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతం గౌడ్, బాల్య వెంకటరాజుగౌడ్, పరశురాములు, బాల్య రవిగౌడ్, చంద్రమౌళి, అంజయ్య, రఘు మోహన్ బాధితుడిని పరామర్శించారు.

కుళ్లిన మృతదేహం గుర్తింపు

ఖిలావరంగల్, జనవరి 3: కాజీపేట–వరంగల్ రైల్వేస్టేషన్ల మధ్య మైలు రాయి 374/18–20 సమీపంలోని రైలు పట్టాల పక్కన కుళ్లిపోయిన మృతదేహాన్ని గుర్తించినట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పీ రాజు తెలిపారు. సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

స్టేషన్ చింతలపల్లిలో చోరీ

గీసుగొండ, జనవరి 3: మండలంలోని స్టేషన్ చింతపల్లికి చెందిన జవ్వాజి హేమలత ఇంట్లో చోరీ జరిగింది. ఆమె డిసెంబర్ 30న కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చారు. దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటో ఉన్న 4.8 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ. 30 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు.

'కళాశాలపై చర్యలు తీసుకోవాలి'

వరంగల్, జనవరి 3: సీఎంఆర్ కళాశాల బాత్‌రూంలో కెమెరాలు ఏర్పాటు చేసిన ఘటనను నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం ములుగురోడ్డు జంక్షన్‌లో ధర్నా చేశారు. అనంతరం సీఎంఆర్ యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్ పటేల్, మిస్రిన్ సూల్తానా, నాయకులు ముషారఫ్, గణేశ్, మున్నా, పాండు, దీప్తి, కావ్య, సాయి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, జనవరి 3: ఇంటర్ ఒకేషనల్ (2022, 2023, 2024) పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల నుంచి అప్రెంటిషిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఐఈవో శ్రీధర్‌సుమన్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఎంజీఎం, సీకేఎం, నర్సంపేట, వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖానల్లో అప్రెంటిషిప్ చేసుకోవడానికి ఈ నెల 8లోగా దరఖాస్తు అందజేయాలని డీఐఈవో కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE
★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును.
No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఘనంగా సావిత్రీబాయి జయంతి

- వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థినులు
- ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్యాలయాల్లో కార్యక్రమాలు
- సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి

ఖిలావరంగల్/రాయపర్తి/సంగెం/నెక్కొండ/నల్లబెల్లి/కరీమాబాద్, జనవరి 3: తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఎంతగానో శ్రమించిన సావిత్రీబాయి పూలే 194వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థినులు సావిత్రీబాయి వేషధారణలో ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో భాగంగా వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, డీఈవో జ్ఞానేశ్వర్ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీఎన్జీవోస్ జిల్లా క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే, రాయపర్తి మండలకేంద్రంలోని లహరి పబ్లిక్ స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. మండలంలోని తిర్మలాయపల్లిలోని ప్రధాన కూడలిలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు ముద్రబోయిన వెంకటేశ్వర్లు సారథ్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంగెం అంబేద్కర్ కూడలిలో సావిత్రీబాయి చిత్రపటానికి మండల

ఖిలావరంగల్: కలెక్టరేట్‌లో సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యశారద

కార్యదర్శి కోడూరి వెంకట్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట జడ్పీహెచ్ఎస్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో సావిత్రీబాయికి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయులు గీత, భూలక్ష్మి, శోభారాణిని సత్కరించారు. అలాగే, నెక్కొండలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పలు సంఘాల నాయకులు సావిత్రీబాయికి నివాళులర్పించారు. నల్లబెల్లి మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సావిత్రీబాయికి ఎంఈవో అంబి వసంత నివాళులర్పించారు. వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని విద్యాలయాలు, కూడళ్లలో సావిత్రీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

పోచమ్మమైదాన్/వరంగల్‌చౌరస్తా/గీసుగొండ/చెన్నారావుపేట/ఖిలావరంగల్/నర్సంపేట/పర్వతగిరి : సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. అలాగే, ఆటోనగర్‌లోని లూయీస్ ఆదర్శ అంధుల పాఠశాలలో బీసీ తెలంగాణ బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ 27వ డివిజన్ యాకుబ్‌పుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట జడ్పీహెచ్ఎస్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఖానాపురం మండలం అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్, బుధరావుపేట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాళ్లు సురేందర్, సునీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు సావిత్రీబాయికి నివాళులర్పించారు. ఖిలావరంగల్ మండలం వసంతపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కడారి భోగేశ్వర్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతి నిర్వహించారు. హనుమకొండ సప్తగిరి కాలనీలోని సాయి స్పందన ఉన్నత పాఠశాలలో అరసం అధ్యక్షుడు బూర భిక్షపతి అధ్యక్షతన సావిత్రీబాయి జయంతి నిర్వహించారు. ప్రొఫెసర్ బైసెట్టి కవిత హాజరై ఉపాధ్యాయురాలిగా పూలే చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ వి.రమ, అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, ఉపాధ్యక్షుడు నిధి తదితరులు పాల్గొన్నారు. నర్సంపేట పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సెంటర్‌లో బీసీ సంక్షేమ సంఘం, ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతి నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్యగౌడ్ పూలే ఫ్లెక్సీకి పూలమాల వేశారు. అలాగే, జడ్పీహెచ్ఎస్(బాలుర)లో ఎంఈవో సారయ్య ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండలో హితకారిణి సేవా సంఘం మహాత్మా జ్యోతిబా పూలే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ గటిక మల్లయ్య సావిత్రీబాయికి నివాళులర్పించారు. పర్వతగిరిలో ఎంఈవో లింగారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పెద్ది, పోచంపల్లి

కేటీఆర్‌కు పెద్ది శుభాకాంక్షలు

నర్సంపేట, జనవరి03: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పెద్ది వెంట ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే గందరగోళం

వరంగల్, జనవరి 3: ఇందిరమ్మ ఇండ్ల సర్వే గందరగోళంగా మారింది. అర్హులైన వారి పేర్లు సర్వే జాబితాలో లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసిన ఫారాలతో బల్దియా చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు చేసిన తప్పిదాలు ఇప్పుడు అర్హులైన పేదలకు శాపంగా మారింది. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సిబ్బంది చెబుతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

మొగిలిచెర్లలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

డిప్యూటీ సీఎం పర్యటనకు

ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్

గీసుగొండ, జనవరి 3: గ్రేటర్ వరంగల్ మొగిలిచెర్లలో ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన ఉన్నందున ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె మొగిలిచెర్లలో పర్యటించారు. మొగిలిచెర్ల, గొర్రెకుంట, విశ్వనాథపురం గ్రామాల్లో నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రాలకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అనంతరం మండలకేంద్రంలో ఈ నెల 8న ప్రారంభం కానున్న ఖోఖో టోర్నమెంట్ ఏర్పాట్లను పరిశీంచారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రియాజుద్దీన్, డీఈ సంపత్, స్థానికులు రాజ్‌కుమార్, ఖోఖో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంబాబు ఉన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఖిలావరంగల్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. రోడ్డు సేఫ్టీకి సంబంధించిన కార్టూన్స్ బుక్స్, నియమ నిబంధనలతో కూడిన కరపత్రాలను స్కూళ్లలో విద్యార్థులకు పంపిణీ చేసి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీటీవో లక్ష్మి, ఎంవీఐ శోభన్‌బాబు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పాత్రికేయుల సహకారం అవసరం

జిల్లా సమగ్రాభివృద్ధిలో పాత్రికేయుల సహకారం అవసరమని కలెక్టర్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఉద్యోగులు, పాత్రికేయులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్వో ఎండీ అయూబ్ అలీ, ఏపీఆర్వో ప్రేమలత, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేయాలి

నర్సంపేట, జనవరి 3: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. మండలంలోని ముగ్దుంపురంలో శుక్రవారం ఆమె సర్వేను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ రాజేశ్, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

హాస్టళ్ల సమస్యలపై అదనపు కలెక్టర్‌కు వినతి

సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా బాధ్యుడు గజ్జెల దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. 25 రోజులుగా సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులు సమ్మె చేస్తుండడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. డీఈవో, ఎంఈవో కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు లేక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

లలిత్‌కుమార్‌గుప్తాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వ్యాపారులు

సీసీఐ సీఎండీని కలిసిన వ్యాపారులు

కాశీబుగ్గ, జనవరి 3: సీసీఐ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తా శుక్రవారం వరంగల్‌లోని సీసీఐ బ్రాంచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాటన్ అసోసియేషన్ అండ్ జిన్నింగ్ మిల్స్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాటన్ వ్యాపారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సీసీఐ జీఎంలు పి.అమర్‌నాథ్‌రెడ్డి, అర్జున్ దవే, కాటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, దుగ్యాల గోపాల్‌రావు, నాగమల్ల ఓంకారేశ్వర్, పింగిలి మల్లారెడ్డి పాల్గొన్నారు.

సారయ్యకు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మణ్

'అక్రమ అనుమతిని రద్దు చేయాలి'

గిర్మాజీపేట, జనవరి 3: అజంజాహి మిల్ కార్మిక భవనంలో అక్రమంగా ఇచ్చిన భవన నిర్మాణ అనుమతి, ఇంటి నంబర్‌ను రద్దు చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను శుక్రవారం మండిబజార్‌లోని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కాశీబుగ్గ: నర్సంపేట రోడ్డులోని అజంజాహి మిల్లు కార్మికుల యూనియన్ భవన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫ్రంట్ ఉమ్మడి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భవన స్థలంలో నిరసన తెలిపారు. ఆ స్థలం కార్మికులకే దక్కాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమాదేవి, కుమారస్వామి, భిక్షపతి, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న సీపీ

సీపీ ఆఫీస్‌లో న్యూ ఇయర్ వేడుకలు

సుబేదారి, జనవరి 3 : హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా కేక్ చేసి పోలీసు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ రవీంద్ర రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ మనన్‌భట్, అదనపు డీసీపీలు రవి, సురేశ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కూరగాయల వ్యాపారులు

నర్సంపేట, జనవరి 3: రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వెజిటేబుల్ (కూరగాయలు) సప్లయర్స్ కలిశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ కామన్ మెనూలో ఉన్న కూరగాయలు అందించడంలో నెలకొన్న సమస్యలపై ఆయనకు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వెజిటేబుల్ సప్లయర్స్ వేముల నవీన్, వేణుగోపాల్, గంధం విజేందర్, పుల్లూరి ప్రసాద్, బండి రవీందర్, మసూద్, రమేశ్, అంజయ్య, అంజయ్య, హైమత్ పాల్గొన్నారు.

పలువురిపై కేసు నమోదు

ఖిలావరంగల్, జనవరి 3: ఉర్సు ప్రతాప్‌నగర్‌కు చెందిన విద్యార్థి కుమ్మరి చరణ్‌తేజ్‌ను గత నెల 31న అకారణంగా అదే ప్రాంతానికి చెందిన దేవులపల్లి నిఖిల్, శ్రవణ్‌తోపాటు మరికొందరు దాడి చేశారు. అతడు ఎంజీఎంహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం తెలిపారు. అలాగే, తూరుకోటలో కాయిత అఖిల్ తన అత్త కనకలక్ష్మిపై దాడి చేశాడు. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన సంపంగి, రాజుపై దాడి చేసిన చింత రాజు, వేణు, రవితేజ, రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం

సంగెం, జనవరి 3: దాతల సహకారంతో సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ కాక మాధవరావు తెలిపారు. కుంటపల్లికి చెందిన ఇందూరి శివారెడ్డి–వాణి దంపతులు మధ్యాహ్న భోజనం కోసం రూ. 8 వేలు అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం పిల్లలకు భోజన సౌకర్యం కల్పించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం శివారెడ్డి, వాణి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకురాలు విజయనిర్మల, లైబ్రేరియన్ రాజ్‌కుమార్, అధ్యాపకులు బుచ్చిరెడ్డి, నాగరాజు, అనిల్‌కుమార్, కుమారస్వామి, యాకసాయిలు పాల్గొన్నారు.

రంగసముద్రం చెరువులో మొసలి

నర్సంపేట, జనవరి 3: గురిజాలలోని రంగసముద్రం చెరువులో శుక్రవారం మొసలి ప్రత్యక్షమైనది. దీంతో చేపల వేటకు వెళ్లిన త్స్యకారులు భయాందోళనకు గురయ్యాయి. సమీప రైతులు సైతం భయపడుతున్నారు. వర్షాల వల్ల వరదనీటి ఉధృతికి కొట్టుకొచ్చి ముసలి చెరువులోకి చేరి ఉంటుందని భావిస్తున్నారు.



రంగసముద్రం చెరువులో కనిపిస్తున్న మొసలి

పెళ్లి కోసం తెచ్చిన డబ్బు బుగ్గిపాలు

- షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని ఆగ్రహం

చెన్నారావుపేట, జనవరి 3: తమ కూతురు పెళ్లిని ఎంతో ఘనంగా చేయాలనుకున్న దంపతులకు నిరాశే ఎదురైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంటితోపాటు డబ్బు, బంగారం, వెండి, వస్తు సామగ్రి కాలిబూడిదైంది. ఈ హృదయవిదారక ఘటన మండలంలోని ఖాదర్‌పేటలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గుంటి రవి–లక్ష్మి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ ఏకైక కూతురుకు పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకు నుంచి లోన్ ద్వారా తీసుకున్న రూ. 4.50 లక్షల నగదు, 4 తులాల బంగారం, 20 తులాల వెండి తీసుకొచ్చి ఇంట్లో దాచిపెట్టారు. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లో ఎర్త్ సమస్య కారణంగా రవి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో

మంటల్లో కాలిపోయిన వస్తువులు చూపుతున్న బాధితుడు

మంటలు ఇల్లంతా వ్యాపించారు. ఇంట్లోని వస్తు సామగ్రి, నిత్యావసర సరుకులతోపాటు రూ. 4.50 లక్షల నగదు, 4 తులాల బంగారం, 20 తులాల వెండి మంటల్లో కాలిపోయాయి. చుట్టు పక్కల వారు రవికి సమాచారం ఇచ్చారు. కుటుంబం మొత్తం వచ్చి చూడగా అప్పటికే సర్వస్వం కోల్పోయారు. బాధిత కుటుంబం రోదనలు మిన్నంటాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అస్థికలనూ వదలని ఆకతాయిలు

- ముంతలపై రాళ్లు విసురుతున్న దుండగులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబాలు

నర్సంపేట, జనవరి 3: శ్మశాన వాటికలో అస్థికల ముంతలను ఆకతాయిలు పగులగొడుతుండడంతో బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పట్టణంలో ఎవరైనా మృతి చెందితే మాదన్నపేట రోడ్డులోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వస్తారు. అనంతరం అస్థికలను ముంతల్లో వేసి అక్కడే ఉన్న చెట్లకు కట్టి భద్రపరుస్తుంటారు. ఆ తర్వాత వీలు నుబట్టి నదుల్లో కలుపుతుంటారు. అయితే, ఈ శ్మశాన వాటిక పక్కనే బెల్ట్ షాపులు, గుడుంబా విక్రయ కేంద్రాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మద్యం మత్తులో కొందరు ఆకతాయిలు అస్థికలు కలిగిన ముంతలను పగలగొట్టి అందులోని చిల్లర డబ్బులు తీసుకోవడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో అస్థి

అస్థికల ఉన్న ముంతలను పగులగొట్టిన ఆకతాయిలు

కల కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు. ఈ శ్మశాన వాటిక పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంది. వెంటనే అధికారులు స్పందించి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సేవ చేస్తేనే ప్రజల్లో తగిన గుర్తింపు: చల్లా

చేరాలు విగ్రహానికి పూలమాల వేస్తున్న చల్లా ధర్మారెడ్డి

సంగెం/గీసుగొండ, జనవరి 3: నిస్వార్థంగా సేవ చేస్తేనే ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సంగెం పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వేల్పుల కుమారస్వామి యాదవ్ తండ్రి తిమ్మాపురం గ్రామానికి చెందిన మల్లికార్జున గొర్రెల పెంపకందారుల సంఘం చైర్మన్ చేరాలుయాదవ్ ప్రథమ వర్ధంతి శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చేరాలు విగ్రహాన్ని చల్లా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంపత్, ఉండీల రాజు, భద్రయ్య, మన్సూర్ అలీ పాల్గొన్నారు. అలాగే, బీఆర్ఎస్ సభ్యత్వం పొందిన గీసుగొండ మండల కేంద్రానికి చెందిన దౌడు బాబు ఇటీవల మరణించాడు. ఈ మేరకు మంజూరైన రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును బాధిత కుటుంబానికి చల్లా అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, పార్టీ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పూండ్రు జైపాల్‌రెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, గుర్రం రఘు పాల్గొన్నారు.

పాపన్నను స్ఫూర్తిగా తీసుకోవాలి: పరుపాటి

రాయపర్తి, జనవరి 3: నైజాం ప్రభుత్వ ఏలుబడిలో పాలకుల ఆధిపత్యాన్ని ఎదిరించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా